క్లుప్తంగా

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు



పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి చైర్మన్ గార్లపాటి కృష్ణకాంత్ నేతృత్వంలో శిబిరం ఏర్పాటు చేసినట్లు మేనేజర్ కృష్ణ ప్రసాద్ తెలిపారు. శిబిరంలో 200 మందికి గుండె, నరాల సంబంధిత పరీక్షలు చేశారు. ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటేశ్వర్లు, విజయ్, శాంతి శ్రీలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

గురజాల : విద్యుత్ షాక్ తగిలి యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో శుభకార్యానికి స్టేజీ ఏర్పాటు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన దీకొండ కృష్ణాచారికి పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు తగిలాయి. వెంటనే కిందపడిపోవడంతో గురజాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని వైద్యశాలకు తరలించారు.

పిడుగురాళ్ల సీఐగా వెంకట్రావు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ సీఐగా వెంకట్రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గుంటూరు ఎస్బీ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడి సీఐ ఆంజనేయులు ప్రస్తుతం వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు ఎవరు చేసినా సహించేది లేదని తెలిపారు. శాంతిభద్రతలు పరిరక్షిస్తామని చెప్పారు.

నేడు మండేపూడిలో ఉచిత వైద్య శిబిరం

అమరావతి: మండలంలోని మండేపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గుంటూరులోని ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వైద్య శిబిరం నిర్వహిస్తారని పేర్కొన్నారు. గుంటూరు నగరంలో ప్రముఖ హృద్రోగ నిపుణురాలు, ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నూతక్కి విజయలక్ష్మి రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. వైద్య శిబిరానికి వచ్చే వారికి ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేస్తారని వివరాలకు 72072 07439 నంబరుకు సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

నిందితులకు కౌన్సెలింగ్

నకరికల్లు: గొడవలు, కొట్లాటలకు పోయి జీవితాలు అంధకారంలోకి నెట్టుకోవద్దని ఎస్ఐ కె.నాగేందరరావు హెచ్చరించారు. పలు కేసుల్లో నిందితులకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీల పేరుతో వివాదాలకు దిగవద్దని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. పలు కేసుల్లో సబ్ జైల్‌లో ఉండి షరతులతో కూడిన బెయిల్‌పై వచ్చిన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ కోర్టు సూచనల మేరకు ప్రతి శనివారం స్టేషన్‌లో హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గ్రేడ్-5 కార్యదర్శులకు డ్రాయింగ్ హోదాపై హర్షం

నాదెండ్ల: పంచాయతీ కార్యదర్శు(గ్రేడ్ -5)లకు ప్రభుత్వం డీడీఓ అధికారంతో పాటు జీతాలు చెల్లింపుకు అవరోధంగా మారిన క్యాడర్ స్ట్రెంగ్త్ సమస్యను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడంపై పంచాయతీ కార్యదర్శుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సాతులూరు పంచాయతీ కార్యదర్శి ముదవర్తి రమేష్‌బాబు, సహాధ్యక్షుడు సిరిపురం హరిబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పంచాయతీ గ్రేడ్-5 కార్యదర్శులకు ప్రభుత్వం డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్ హోదా కల్పిస్తూ ఈ ఏడాది మార్చిలో ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

యడ్లపాడు: రోడ్డును క్రాస్ చేస్తున్న బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటనపై శనివారం పోలీస్‌లు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని జగ్గాపురం గ్రామానికి చెందిన కిరణా వ్యాపారి దావల నాగేశ్వరరావు ఈనెల 11 తేదీన తిమ్మాపురం గ్రామంలోని వివాహానికి హాజరయ్యాడు. తిరిగి స్వగ్రామానికి బయలుదేరి వెళ్లే క్రమంలో తిమ్మాపురం హైవే జంక్షన్ దాటుతుండగా అదే సమయంలో చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడగా గుంటూరులోని ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జె.శామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు.

అందరికీ 'ఉపాధి' కల్పించేలా చర్యలు



పంట కాల్వ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దృశ్యం

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు కలిగి పని అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని మంచికల్లు, రెంటచింతల, మిట్టగుడిపాడు, పశర్లపాడు గ్రామాలలో పథకం కింద చేపట్టిన పంట కాల్వల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి, మాట్లాడారు. 2024–25లో గుర్తించిన పనులను ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేయాలన్నారు. మండల పరిధిలోని 11 గ్రామాలలో రూ. 14 కోట్ల విలువైన 478 పనులకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందన్నారు. ప్రస్తుతం రైతులకు సాగునీటి కోసం గ్రామాలలో పంట కాల్వలలో పూడికతీత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. 11 గ్రామాలలో 11,246 మందికి ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డులు అందించామన్నారు. 5 ఎకరాలలోపు ఉన్న చిన్న, సన్న కారు రైతులకు పలు రకాల పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించామని చెప్పారు. సుమారు 200 ఎకరాలలో సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వేసవిలో మొత్తం 7 వేల కుటుంబాలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చూపామని వెల్లడించారు. రోజుకు వేతనం రూ.300 ఇస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే మరికొన్ని పనులను చేపట్టేందుకు గ్రామాలలో ఎఫ్ఏలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయన వెంట ఏపీవో జి. జయచంద్రకుమార్, ఎఫ్ఏలు తదితరులున్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కొప్పునూరులో పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి సత్యనారాయణ, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు

మాచర్ల రూరల్: సీజనల్ వ్యాధులు నివారించేందుకు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. శనివారం మండలంలోని కొప్పునూరు, లచ్చమ్మబావి, అచ్చమ్మకుంట, రేగులవరం, కొత్తపల్లి, తాళ్ళపల్లి, భైరవునిపాడు తదితర గ్రామాలలో ఎంపీడీవో సరోజనీదేవి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు సిబ్బందితో ఈ పనులను ప్రారంభింపజేశారు. వీధులను శుభ్రపరిచి, కాలువలలో పూడికతీత పనులు చేపట్టారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి కాలువలలో దోమల నివారణకు మిథైల్ ఆయిల్ స్ప్రే చేశారు. అంటువ్యాధుల నివారణలో గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు టీపీ సత్యనారాయణ, ఆవుల వెంకటనారాయణ, బాబులాల్ నాయక్, కోటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్డులతో కౌలు రైతులకు ఎన్నో ప్రయోజనాలు

రెంటచింతల: ప్రభుత్వం అందిస్తున్న కార్డుల వల్ల కౌలు రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. కౌలు రైతులు దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ– పంట నమోదు చేసుకోవడానికి కచ్చితంగా కౌలు కార్డు అవసరమని చెప్పారు. రైతులకు బీమా, పండించిన పంట విక్రయం, రుణాలు, ప్రభుత్వ పథకాలు పొందడానికి కార్డుతోనే అవకాశం ఉందని వివరించారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని గుర్తించి కార్డులను మంజూరు చేస్తారన్నారు. ప్రతికూల వాతావరణం వల్ల వేసిన పంటలు నష్టపోయిన సమయంలో కౌలు రైతులకు ఈ కార్డు ఆధారంగా నష్టపరిహారం అందుతుందని చెప్పారు. అర్హులైన ప్రతి కౌలు రైతుకి కార్డులను తప్పనిసరిగా అందించేందుకు గ్రామ వ్యవసాయ సహాయకులు కృషి చేయాలన్నారు. కార్డుల వల్ల భూ యజమానులకు ఎటువంటి నష్టం జరగదని, దీనిపై అవగాహన కల్పించామన్నారు. గ్రామ రెవెన్యూ అధికారిని, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి కార్డు పొందాలన్నారు. ఇప్పటి వరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 308 మందికి కార్డులను అందించినట్లు పేర్కొన్నారు.

నకిలీలతో జర భద్రం

- ప్రతి ఏడాది నకిలీ విత్తనాల బెడద
- రెండేళ్లగా నష్టపోతున్న మిర్చి రైతులు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన
- లైసెన్స్ ఉన్న విత్తనాల దుకాణాల్లో కొనుగోలు చేయాలి
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



లగడపాడులో నకిలీ విత్తనాలతో నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న లాం ఫాం శాస్త్రవేత్తలు (ఫైల్)

పెదకూరపాడు: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. వర్షం కురిసిన వెంటనే దుక్కి దున్నుతున్నారు. ప్రస్తుతం పల్నాడు జిల్లాలో రైతులు విత్తనాలు సమకూర్చుకుంటున్నారు. ఈ సమయంలో పలు రకాలు కంపెనీల విత్తనాలు ప్రచారం జోరందుకుంది. నాణ్యమైన విత్తనాల కోసం రైతులు ఆరా తీస్తున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ సంస్థలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచారార్భాటాలతో రైతులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. కాగా రైతులు విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్‌లు ఉన్న విత్తనాలనే కొనుగోలుచేయాలంటూ గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎంపికపై అవగాహన కల్పిస్తున్నారు.

మిర్చి, పత్తి రైతులే టార్గెట్‌గా నకిలీ దందా..

పల్నాడు జిల్లాలో మిర్చి, పత్తి సాగు అధికంగా రైతులు సాగు చేస్తుంటారు. ఈ ఏడాది కూడా ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. గత రెండేళ్లగా పల్నాడు జిల్లాలో ముఖ్యంగా పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గంలో పత్తి, మిర్చి నకిలీ విత్తనాల బారిన పడ్డ రైతులు తీవ్రంగా నష్టపోయ్యారు. చీడపీడలతో దిగుబడులు లేక అల్లాడుతున్న రైతులకు నకిలీ బెడద కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో లైసెన్స్ లేని విత్తనాల దుకాణదారులు రైతులకు వల వేస్తున్నారు డీల్లర్లకు బోలెడు ఆఫర్లు చూపి, పలు కంనెనీ యజమాన్యాలు రకరకాల ప్యాకేజీలు, పలు ఆఫర్లు చేస్తున్నాయి.

గతంలో మోసపోయిన రైతులు

పెదకూరపాడు మండల కేంద్రంతో పాటు గతేడాది అబ్బరాజుపాలెం, రాజుపాలెం, బుచ్చయ్యపాలెం లగడపాడు, కాశిపాడు, తమ్మవరం బలుసుపాడు గ్రామాల్లో రైతులు 3,700 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ప్రముఖ కంపెనీకి చెందిన విత్తనాలు డీలర్ల వద్ద కోనుగోలు చేశారు. విత్తనాలు నారుమడులో నాటి 60 రోజులు గడుస్తున్నా ఎదుగుదల సక్రమంగా లేకపోవడం, బొబ్బర వైరస్ సోకి పెరిగిన మొక్కకు పూత, పిందె రాకపోవడంతో నిండా మునిగిపోయామని రైతులు గ్రహించారు. కొందరికి విత్తన కంపెనీలు పరిహారం ఇచ్చాయి.

జాగ్రత్తగా ఉండాలి



రైతులు అప్రమత్తంగా ఉండాలి. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనాలి. విత్తనాలు కొనుగోలు చేస్తే రసీదు తీసుకోవాలి. పంట బీమా పొందాలంటే రసీదు తప్పనిసరి. దుకాణాల్లో డీలర్లు విత్తనాలు వివరాలను రిజిష్టర్లలో నమోదు చేయాలి. రైతులు కూడా నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు పాటించాలి. గ్రామాల్లో నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

–శ్రీ నిత్య, ఉద్యానవన శాఖాధికారి.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



సదస్సులో మాట్లాడుతున్న పారా లీగల్ వలంటీర్ సుభాని

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): వాహనదారులు తప్పనిసరిగా భద్రతా నియమాలు పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సివిల్ జడ్జి వెంకట నాగశ్రీనివాసరావు సూచనల మేరకు మోటారు వాహనాల చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. ముప్పాళ్ళ ఏఎస్సై నవరాజు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అతిసారను అరికడదాం



ర్యాలీ నిర్వహిస్తున్న రాజుపాలెం పీహెచ్‌సీ సిబ్బంది

రాజుపాలెం: అతిసార వ్యాధిని అరికట్టడంలో ప్రతి ఒక్కరూ అవిశ్రాంతంగా పనిచేయాలని కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్ హన్నాకుమారి సూచించారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ నుంచి శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గృహాల్లో తప్పనిసరిగా వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం ఉండాలన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు విరేచనాలు, వాంతులు అయితే ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు ఉచితంగా ఇవ్వాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్‌లు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసుకోవాలన్నారు. వారానికోసారి నీటి నమూనాలు పరీక్షించుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ప్రమీలబాయి, అంగన్‌వాడీ కార్యకర్త రమణ, ఆశ కార్యకర్తలు ఈశ్వరమ్మ, రెబ్బమ్మ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి



రైల్వేస్టేషన్ రోడ్డులో దుస్థితిని వివరిస్తున్న సీపీఐ నాయకులు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టి ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు కోరారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను శనివారంనాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు సౌకర్యాలను కల్పించటంలో అధికారులు విఫలమయ్యారని తెలిపారు. పారిశుద్ధ్యం, మంచినీటి వసతి కల్పించాలని కోరారు. రైల్వేస్టేషన్‌కు వచ్చే మార్గం గుంతల మయమైందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. ఆయా సమస్యలపై ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వెంటనే స్పందించి చర్యలు తీసుకునేలా రైల్వే అధికారులపై వత్తిడి తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, షేక్ చినజాన్‌సైదా పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ముప్పాళ్ళ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. మండలంలోని గోళ్ళపాడు సేఫ్ ఫార్మా కంపెనీ వద్ద ఈ నెల 4న జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన నూర్ బాషా బాజీవలి తీవ్రంగా గాయపడ్డాడు. నరసరావుపేటలో ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు నరసరావుపేటలోని ఏపీ ఎస్‌బీసీఎల్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు రూరల్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్ తెలిపిన వివరాల మేరకు నగరాలు మునుస్వామినగర్ రెండవ లైనుకు చెందిన తల్లపురెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి(30) నగరంలో కొరియర్ బాయ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కొరియర్ పనికి వెళ్లి రాత్రి 10 గంటలకు తిరిగి వచ్చి ఇంట్లో తన గదిలో నిద్రకు ఉపక్రమించాడు. తెల్లవారినా నిద్రలేవకపోవటంతో కుటుంబసభ్యులు గదిలోకి వెళ్లి చూడ గా ఫ్యాన్‌కి లుంగితో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో మృతదేహాన్ని దించి పోలీసులకు స మాచారం అందించారు. ఆత్మహత్యకు కారణం అప్పుల బాధలేనని బంధువులు తెలిపారని పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి పోస్ట్ మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడి తండ్రి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఎన్‌టీఆర్ ప్రతిభా పురస్కారాలు ప్రదానం



ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం

నగరంపాలెం: గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కళా దర్బార్ (అమరావతి) ఆధ్వర్యంలో ఎన్.టి.ఆర్ 101వ జయంతి వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి ఎన్డీఏ కూటమి ప్రజా ప్రతినిధులకు ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, నివాళులర్పించారు. అనంతరం సంగీత విభావరిలో ఎన్టీఆర్ చిత్రాల్లోని గీతాలను గాయకులు శైలజ, సౌజన్య, పావని, రసూల్‌బాబు, సుధీర్‌బా బు, హరికిషన్, లెజెండ్ గాయకుడు ప్రవీణ్ కుమార్ ఆలపించారు. కళా దర్బార్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు మాట్లాడుతూ తెలుగు తేజ స్ఫూర్తి ప్రదాత, సినీ రంగంలో రారాజుగా వెలు గొందిన తెలుగుజాతి ఆరాధ్య దైవం ఎన్టీఆర్ అన్నారు. జాతి ఘనతను, కీర్తిని ప్రపంచ నలు మూలలకు చాటి చెప్పిన కారణజన్ముడని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యేలు గల్లా మాధవి (గుంటూరు పశ్చిమ), నసీర్ అహ్మద్ (గుంటూరు తూర్పు), డాక్టర్ చదలవాడ అరవిందబాబు (నరసరావుపేట) ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన టీడీపీ పొలి ట్‌బ్యూరో సభ్యులు టీడీ జనార్దన్, టీడీపీ అధికార ప్రతినిధి రామకృష్ణప్రసాద్, ప్రముఖ నిర్మాత ఆర్.వెంకటేశ్వరరావు, ముప్ప హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ముప్పా వెంకయ్యచౌదరి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పి.కల్పన, మేకల రవీంద్రబాబు, గుమ్మడి గోపాలకృష్ణ పాల్గొనగా, వ్యాఖ్యాతగా ప్రాసమణి, కుమార్ వ్యవహరించారు.

జ్వరంతో చికిత్స పొందుతున్న గర్భిణి మృతి



మైలా నిరీషా మృతదేహం

పెదకాకాని: జ్వరంతో చికిత్స పొందుతున్న గర్భిణీ మృతి చెందిన సంఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే 9 నెలల గర్భిణీ మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో వివాదం చోటు చేసుకుంది. మంగళగిరి రూరల్ మండలం ఎర్రబాలెంకు చెందిన మైలా గోపీకృష్ణకు రత్నాలచెరువుకు చెందిన నిరీషాతో 2019లో వివాహం జరిగింది. వారికి 16 నెలల పాప గుణ దీక్షిత సంతానం. నిరీషా తొలి కాన్పు పెదకాకాని గ్రామంలోని శ్రీహనుమత్ కాశీ వరప్రసాద బాబూజీ ట్రస్టు ఆసుపత్రిలో చేయించుకుంది. ప్రస్తుతం ఆమె 9 నెలల గర్భిణీ. జ్వరంతో ఇబ్బంది పడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు ఈ నెల 10న కాశీ వనాశ్రమం ఆసుపత్రిలోనే చేర్పించారు. చికిత్స పొందుతున్న మైలా నిరీషా(26) పరిస్థితి విషమించి శనివారం తెల్లవారు జామున మరణించింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే నిరీషా మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో ఆసుపత్రి వద్ద వివాదాస్పద వాతావరణం చోటు చేసుకుంది. స్థానికుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ కె వీరాస్వామి, సిబ్బంది విచారణ చేపట్టారు. కొద్దిసేపటి తరువాత ఆసుపత్రి నిర్వాహకులు, మృతురాలి బంధువులకు మధ్య జరిగిన చర్చలు సఫలం కావడంతో మృతదేహాన్ని ఆసుపత్రి అంబులెన్స్‌లో యర్రబాలెం తరలించారు.

పురుగుల మందు తాగి కౌలు రైతు ఆత్మహత్య



మాచర్ల రూరల్ : వరుసగా పంట సాగులో వస్తున్న నష్టాలను తాళలేక కౌలు రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దగ్గుల బ్రహ్మారెడ్డి (38) మూడేళ్లుగా రెండు ఎకరాలల్లో పత్తి, మరో ఏడు ఎకరాలు కౌలు తీసుకొని మిర్చి సాగు చేస్తున్నాడు. కానీ, అప్పుల పాలయ్యాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం అటుగా వెళ్లిన రైతులు కొందరు మృతదేహాన్ని చూసి బంధువులకు తెలిపారు. బ్రహ్మారెడ్డికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభి రామయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు కల్చరల్ కార్నివాల్



పల్నాడు కల్చరల్ కార్నివాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న రంగస్థలి ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట రంగస్థలి 44వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 14వ తేదీ ఆదివారం ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో పల్నాడు కల్చరల్ కార్నివాల్-2024 సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రంగస్థలి అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని, ప్రధాన కార్యదర్శి నల్లపాటి బోస్ తెలిపారు. టౌన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, కార్యక్రమాలలో భాగంగా ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం విజయవాడ శ్రీనృత్య ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో కళారత్న భాగవతుల వెంకటరామశర్మ నేతృత్వంలో కూచిపూడి బృంద నృత్య కేళిక ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. వార్షికోత్సవంలో భాగంగా సినీ నటుడు రఘుబాబును రంగస్థలి ప్రతిభా పురస్కారంతో సత్కరించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో కళాకారులు, కళాభిమానులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రంగస్థలి గౌరవాధ్యక్షుడు కిలారు వేంకటరావు, కోశాధికారి కె.సూరిబాబు, ఉపాధ్యక్షుడు కె.ఆర్.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



మొక్కలు నాటుతున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

చిలకలూరిపేట: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని చెప్పారు. క్లబ్ ఆధ్వర్యంలో వంద పడకల ఏరియా ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. చెట్ల పెంపకంతోనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందన్నారు. రోజురోజుకు పెరిగి పోతున్న వాతావరణ కాలుష్య నియంత్రణకు చెట్ల పెంపకమే పరిష్కారమార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీకుమారి, క్లబ్ కార్యదర్శి నార్నే జయలక్ష్మి, సభ్యులు తియ్యగూర రమాదేవి, డాక్టర్ సత్యదీప్తి, డాక్టర్ సంజూష పాల్గొన్నారు.